అరికాళ్ల కింద మంటలు

"దిమ్మచెక్కలాగ అలా కూచోకపోతే కాస్త గంధం తియ్యరాదుషే? రోజూ పురమాయించాలా?"

"పెద్దబావ నిన్ననే వెళ్ళిపోయాడు కదా—"

"గంధం పూసుకోతగ్గవాళ్ళే కనబడ్డంలేదూ నీకు?"

"పోనీ, పురమాయించినట్టే చెబితే యేం?"

"మీఅమ్మా మీనాన్నా-నోటితో చెప్పాలిషే?"

"లేకపోతే యెలా తెలుస్తుందీ నావంటిదానికీ?"

"నిజంగా నీకీమాత్రం వూహ తోచనేలేదూ? ముసలాళ్ళా ముక్కాళ్ళా? వాళ్ళకేమే? నిక్షేపంలాగ గంధంపూసుకోకా?"

"................"

"ఈజన్మలో నీకెలాగా ఆయోగం లేదు. ముందుజన్మలోనయినా సుఖపడా లంటే యిప్పుడిలాగ ముత్తయిదువులికి గంధంతీసి యివ్వడమూ, మల్లెమొగ్గలు దండలుగుచ్చి వెయ్యడమూ - అందులోనూ కన్నవాళ్ళకి. ఇంతకంటే పుణ్యం యేమిషే?,"

"చూశా అనుభవించా, గంధంపూసుకుంటే యెలాంటి సుఖం కలుగు తుందో వొకళ్ళకలాంటి సుఖం కలిగిస్తే యెంత పుణ్యం వస్తుందో తెలవడానికి? ఇంతకీ ఈ జన్మలో యింతయింది, ముందుజన్మలో సుఖపడనేమో అని బెంగ. ఏదో చేతులారా ప్రాణాలు తీసుకోలేక బతకడం. కాకపోయినా ముందుజన్మలో మనిషినే అయి పుడతానన్న మాటేమిటి?"

"నిజమే. ఇలాంటి బుద్ధులుండే వాజమ్మ మనిషిజన్మ రమ్మంటే మాత్రం యెలావస్తుంది?"

"వచ్చేం వొరగదోసింది? ఇంతకంటే పశువుజన్మో, పిట్టజన్మో వస్తే నయం, యీరాతా యీకోతా—"

"వెనకటి జన్మలో యెవళ్ళని చూసి యేడ్చావో? ఎవళ్ళ సుఖం పడగొట్టావో? ఎవళ్ళకి యెడబంధాలు కల్పించావో? లేకపోతే నీకిప్పుడీరాత యెందుకు వస్తుంది? కనక ముందు జన్మకోసం జాగ్రత్తపడవే అంటే-నీకోసమే గాని నా కోసమా యేమిషి?"

"నీకోసమని యెవరన్నారేమిటి? అసలెవరికోసం అయితే మాత్రం నాకు తప్పుతుందేమిటి? నువ్వు ప్రేమవున్నదానవు కనక నీకూతురికోసం గంధం తియ్యమన్నావు, తప్పని యెవరన్నారేమిటి? నాకా వూహ కలగలేదు గాని నేనేం తియ్యనన్నానా, తియ్యనా? నువ్వు స్పష్టంగానూ, కచ్చితంగానూ చెప్పావు కనక యివాళ మొదలుకుని యేరోజునయినా తియ్యకపోతే అడుగు. తిని కూచోవాలంటే సాగుతుందా యేమిటి నాకు? రెక్కల్లో సత్తువ వుందికదా?"

"వోసి నీ మొగం యీడ్చా, కాస్తమాట అనేటప్పటి కెంత దండకం విడేశావే"

"..............."

"తల్లికీ తండ్రికీ చెయ్యడానికే యేడ్చేదానవు నువ్వు మరొకళ్ళకేం చేస్తావే?"

"................."

"పెద్దబావ వుండిన వారందినాలూ యేడుస్తూనో, మొగం మాడ్చుకునో కాస్త గంధం తీశావే! స్నానానికి కసిన్ని వేన్నీళ్ళు కాచావే! ఇంతేనా నువ్వు

చేసింది అతగాడికి! వేదంఅంతా చదువుకున్న బ్రాహ్మడు, అతగాడికి దెయ్యడం దేవుడికి దెయ్యడం కాదుషే!"

"ఆ వివరాలన్నీ పెట్టిపుట్టినవాళ్ళకి గాని నాకు గాదు. నా బతుక్కి దేవుడయినా వొకటే, మనిషయినా వొకటే — తుదకి దెయ్యంఅయినా వొకటే. ఎవరికయినా చెప్పిందల్లా — తోచింది కూడా — చేతనయినంతా చేశాను. నేనేమీ వొళ్ళు దాచుకోలేదు."

"దాచుకుందామనుకుంటే సాగనిస్తారా యేమిషీ?"

"సాగనిస్తున్నారా యేమిటి? సాగనివ్వమని నేనేడ్చానా యేమిటి? దొడ్లో గేదీ వుంది, యింట్లో నేనూ వున్నాను, ఇంటిల్లపాదికీ —"

"వోసి నీసిగ్గు చిమడా, కనిపెంచే గేదికీ నీకూ సాపత్యంషే? కనాలని— యెంత వూహవుందే దిక్కుమాలినపీనుగా?"

"................"

"దరిద్రం వోడుకుంచూ పుట్టుకువచ్చావు. నీకే అంత అదృష్టం?"

"...................."

"నువ్వే ముహూర్తాన కడుపునపడ్డావో అప్పుడు చచ్చిబతికింది మాఅమ్మ. నువ్విలా చేటలో పడ్డావు. మీనాన్న వుద్యోగం అలా పోయింది"

"నాకు పుస్తికట్టాడు ఆపిల్లాడు చచ్చాడు. ఏం, యీమాట కూడా అన్నావుకాదేం?"

"వోసి నీయిల్లు—అనలేదేమని యింకా ముదలకించడం కూడానా? నిజంగా నిన్ను పెళ్ళాడి వుండకపోతే బతికే వుండును ఆ వెర్రితండ్రి. పదహారేళ్ళకే "దరుడుపారం" — అతనెంత వుద్యోగస్థుడయిపోయివుండునో నీకేం తెలుసూ? పైగా 'చచ్చాడు చచ్చా'డని యీసడింపు కూడానా?"

".... ...."

"నీకు పుస్తికట్టడమే అతనికి ముప్పయిపోయింది"

"...................."

"నువ్వు కాలుపెట్టావు, వొక్క కొడుకు — ఆతల్లి కడుపు కాలిపోపోయింది"

"...................."

"నిజంగా చచ్చే సుఖపడ్డాడా అబ్బాయి. అతను బతికే వుంటే నువ్వు కాపరం చేస్తువా? కాపరమేచేస్తే అన్నం పెడుదువా? అన్నం పెడితే నిద్రపోనిస్తువా?"

"నిద్రపోనిస్తే ఆ నిద్రలో, పీక పిసికి——?"

"ఆ,ఆః ఏమని పేలావూ? ఎంత పొగరెక్కావూ?"

"...................."

"నువ్వంతపనీ చేసేదానవు మాత్రం అవుదువు. విన్నావా? నువ్వెంత కేనా సాహసురాలవు"

"...................."

"చేసుకున్నవాణ్ణి, చచ్చి స్వర్గాన్నున్న మొగుణ్ణి——"

"నన్ను చేసుకున్నాడుగదా, మరి, ఆ పిల్లాడికి స్వర్గం వస్తుందా?"

"నిజమే. అదీ నిజమేనే. ఎంత జాణవయినావూ? కొంప చెడపుట్టి—— మనోవర్తికయినా గతిలేకుండా——"

"మనోవర్తా? నాకెందుకూ మనోవర్తీ? నాకు డబ్బెందుకూ? చాకిరీ చెయ్యడంకోసం పుట్టాను, ఎవళ్ళు చేయించుకున్నా చేస్తాను. చేయించుకున్న వాళ్లు గంజనీళ్లు పొయ్యక పోతారా?"

"కనక చెయ్యి, పుచ్చినట్టు చెయ్యి"

"పుచ్చినట్టేం, చచ్చినట్టు చేస్తాను. చేస్తూనూ వున్నాను కనపడ్డం లేదూ?"

"కనపడకేం, నిక్షేపంలా కనబడుతోంది, నాకేం కనపడకా? మీ నాయనమ్మకిలాగ నాకూ కళ్ళు పోవాలను కుంచున్నావు కాబోలు, వొక్కనాటికి పోవు. నన్నన్నవాళ్ళ కళ్ళు పోతాయి. దించుకు పోతాయి.........నా చేతుల్లో పుట్టి, నాచేతుల్లో పెరిగి నన్నెదిరిస్తావా? నన్నెదిరిస్తావా అంభః నన్నెదిరించి నువ్వు బతగ్గలవుషే?"

"నాకు బతకాలని వుంటేనా నీతో పంతం వేసుకోడానికీ? కనక ఆ వుపాయంమాత్రం కాస్త తొందరగా చూడు; చాలా పుణ్యం వస్తుంది నీకు"

"ఏమన్నావూ? ఏం పేలుతున్నావూ? నేనేం మందులు పెడతానా, మాకులు పెడతానే? ఎంతలేసి మాట లంచున్నానే, చలితేలులాగ కుంక పీనుగా"

"... ...."

"ఎంత వొళ్ళు కరుచుకుని తిరుగుతున్నావే పింజారీ!"

"...................."

"........చద్దువుగాని, చద్దువుగాని——నేను కాస్త నిద్రపోయి లేచా టప్పటికి, అవిగో, బాగుచెయ్యకపో మహమ్మాయి వండించేస్తానోలేదో చూసు కుందువుగాని"

"..............."

"నేలబెట్టి రాసేస్తాను కాని నిన్ను చావనిస్తానుషే"

"..............."

2

"ఏమే చెల్లీ, వొక్కపని చెబుతాను చేసిపెట్టవూ?"

"అడగడం యెందుకే?"

"అయితే చేస్తానను"

"చెయ్యకపోవడం యెలా వస్తుందీ? చేస్తానని చెప్పే చేస్తున్నానా చేసే వన్నీనీ"

"........ఈగుడ్డ రైక కుట్టిపెట్టాలి. అంతే"

"అలాగే..........."

"దీపాలు పెట్టాటప్పటికి—తెలిసిందా?"

"ఇవాళ నావల్లకాదు సుమా? రేపు—"

"ఇవాళేం చేస్తావమ్మా?"

"పెద్దక్క తన కూతురికి జుబ్బాకుట్టమని భోజనంకాగానే యిచ్చింది గుడ్డ. ఈపని తెమలగానే ముందది."

"పోనీలే..........."

"........అదేమే అలా వుళాక్కుంటావూ?"

"...........అక్కర్లేదులే........"

"నేను కుట్ట ననలేదు, ఆపైని నీయిష్టం"

"కుట్టనని నోటితో అనాలా యేమిటి? పైగా నీయిష్టం కాని నాయిష్టమా యేమిటి? నాయిష్టమే అయితే నువ్వు వాయిదా వెయ్యగలవా యేమిటి?"

"ముందు పుచ్చుకున్నపని వెనక్కిపెడితే అదేమంటుందో యేమయినా ఆలోచించావా?

"కొడుతుందా యేమిటి?"

"..............."

"దాని కూతురికి లగ్గం మించిపోతుందా యేమిటి?"

"..............."

"అసలు పెద్దదంటే నీ కభిమానం. అది నే నెరగనను కున్నావా? స్పష్టంగా చెప్పెయ్యక యీ ముసుగులో గుద్దులాట లెందుకూ?"

"దుడుగూ దుడుగూ మాట లనెయ్యడమేనా కాస్తేనా నాసంగతి చూద్దం వుందా?"

"నీసంగతి కేమమ్మా? వండాలా, వార్చాలా?"

"అదే నయం, మడికట్టుకుంటే చాలా పనులు తప్పించుకోవచ్చు"

"ఇప్పుడయితే మాత్రం, యీకసిన్ని కందులూ బాగు చెయ్యడమేనా?"

"......కసిన్నిటే యివీ?"

"కసిన్ని కాదు, నాలుగు కుంచాలు, అంతేనా?"

"ఇప్పుడెన్ని గంటలయిందో యెరుగుదువా?"

"రెండే కాదూ,? మూడు కొట్టాటప్పటికి యిదయిపోతుంది. తరవాత?"

"ఒక్క గంటలోనా?"

"పోనీ నాలుగింటికి. తరవాత యేం చేస్తావమ్మా?"

గంధం యెవరు తీస్తారూ?"

"అదెవరికే? బావ నిన్ననే వెళ్ళిపోయాడు కాదూ?"

"అమ్మకీ నాన్నకీని"

"అమ్మ తియ్యమందా?"

"అమ్మ కాదు, అమ్మమ్మ"

"అదేమిటే?"

"అదేమిటే అంటే?"

"అమ్మమ్మ చెప్పడానికి—"

"తప్పేం? ప్రేమగల తల్లులు, ముద్దుల కూతుళ్ళకోసం పురమాయించుకుంటారు. చెప్పకుండానే యెందుకు తీశావు కాదని—"

"శాబాస్, పోనీ అరగంటలో అదయిపోతుంది."

"అరగంటకా?"

"వొక్క గంటకే అను. అప్పుడు?"

"మరోపని తగలకపోతే అక్క కూతురి జుబ్బా—"

"ఎంత చెప్పినా చివరి కదేమాట, కాస్తేనా సరసం తెలిస్తేనా? ఇవాళో రేపో వస్తారు మీ బావ. నెల్లాళ్ళ కిందట వచ్చినప్పుడు తెచ్చి యిచ్చారిది. మళ్ళీ వచ్చాటప్పటికే—"

"ఇన్నాళ్ళూ చెప్పావుకావేం మరీ?"

"ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాకపోయినా, గంట పని, ఎన్నాళ్ళు చెప్పాలేమిటి యీమాత్రం మహాభాగ్యానికి? నువ్వు గట్టిగా తలుచుకుంటే అర గంటకే అయిపోతుంది........కుట్టి పెట్టవే ఏమే చెల్లీ?"

"కుడతానన్నాను కదూ?"

"ముందు కుట్టాలి........ఏం?"

"ఏది ముందయినా నా కొక్కటే. అయితే పెద్దక్కకి కోపం రాకుండా చూస్తావా?"

"........నీయిష్టం వచ్చినట్లు తగులడు. నేనే పని చెప్పినా యింతే నువ్వు. పెద్దదంటే పడిచచ్చిపోతావు. అదీ నువ్వూ కట్టకట్టుకుని గోదావరిలో దిగండి. కాస్త రైక భాగ్యానికి — నేను కుట్టుకోలే ననుకుంటున్నావు కాబోలు పాపం. నువ్వీ మాత్రం సాయం చెయ్యకపోతావా అని ఆసపడ్డందుకు— పోనీ, రేపు సాయంత్రానికి తప్పకుండా కుట్టేస్తావా?"

"...............ఆ"

"వీలయితే రేపు పొద్దున్నే కుట్టేయ్యి. కొత్తచీర కట్టుకుని పాప సోదెమ్మ అత్తగారి యింటికి వెడదామని — దానిమీది కిదెంతో బావుంటుంది. కదుటె చెల్లీ?"

"చెల్లాయికి తల అంటడమూ, తమ్ముడికి తల దువ్వడమూ, అక్క కూతురి పక్కగుడ్డలు—"

"అవెంత సేపే?"

"మరి దూడల సాల?"

"బాగుచేస్తా వనుకో?"

"పాలు?"

"పితికేస్తావు. దానిమీద పడేస్తావు. చల్లకూడా అయిందనిపించేస్తావు. నాన్న పంచె వుతికి ఆరేస్తావు. ఇంతేనా? ఇంకేమిటమ్మా?"

"అవన్నీ నీకెందుకు, నేను చూస్తాను కాదూ?"

"చూస్తానేమిటి, చేస్తానను"

"అంటే చేసినట్టూ అనకపోతే మానేసినట్టూనా?"

"సరే, యేం నంగనాచివే మామ్మా?"

"..................."

"ఎంత కటికతనమే మా తల్లీ?"

"..................."

"ఎంత బతిమాలినా గిజా అనే — అయితే రేపు సాయంత్రానికి తప్ప కుండా కుడతావా?"

"కుడతాను"

"మరిచిపోకుసుమా. అసలు, మధ్యాహ్నం భోజనాలు కాగానే నీదగ్గిరే పడుకుంటానులే నేను. దిక్కుమాలిన యెండలు ముదిరిపోవడంవల్ల తిండి తినగానే కసింత సేపు నిద్రపోతేగాని — మళ్ళీ లేచాటప్పటికి కుట్టేస్తావు, కాదుటే?"

"......................"

"మీ బావ యెంతో మెచ్చుకుంటారు నిన్ను. మాకు వుద్యోగం అయ్యాక నువ్వు వచ్చి మాదగ్గిర వుందువుగాని. ఏం, వుంటావా?"

"......................"

"మాట్లాడవేమే?"

"మాట్లాడ్డం యెందుకూ? ఎవరిదగ్గిరా వుండకపోతే రోజు లెలా వెడతాయీ నా బతుక్కీ?"

"ఎంత మాటన్నావే దిక్కుమాలినదానా? నీకంత నీరసంగా వుందానే నంటేనూ? నువ్వు రాకపోతే నేను చేసుకోలే ననుకుంటున్నావా? అసలు వంటలక్కనే పెట్టేసు కుంటాము మేము, ఒకళ్ళ అవసరమే మాకులేదు"

"......................"

"తోడబుట్టినదానవు కదా — గతిలేనిదానవు కూడా కదా అని — రేపు కుట్టకపోతే అమ్మమ్మతో చెబుతా నేమనుకున్నావో మరి?"

"......................"

"హోస్! మాట్లాడితే కంటనీళ్ళు. ఎవరికీ భయంలేదు"

"......................"

3

"జుబ్బా యెంతవరకూ – ఇంకెందుకే గంధం?"

"వూసుకోడానికి"

"ను – ఎవరూ?"

"అమ్మా, నా – "

"మళ్ళీ యెప్పణ్ణుంచే?"

"ఎప్పణ్నుంచో, యెందాకానో నాకు తెలియనూ తెలియదు. తెలియనూ అక్కర్లేదు. నీకు కావలిస్తే అమ్మమ్మని—"

"ఆవిడ పురమాయించిందా?"

"అవును"

"........సరే, అదంతా నాకెందుకుగానీ — సగమేనా కుట్టావా జుబ్బా"

"కత్తిరింపు లయినాయి"

"సెబాస్! పదకొండున్నర కనగా యిస్తే యిప్పటికి కత్తిరింపులా అయినాయి?"

"అవయినా అయినందుకు—"

"సంతోషించ మంటావా? నా పనంటే నీకంత వేళాకోళమూ, వెక్కిరింతగానూ వుందా?"

"........ ...."

"ఎందుకమ్మా అలా చూస్తావూ? ఈ కాస్తకే యింత రోషం వచ్చే దానవు, మరి, సగంసగమే చేసి యెందుకు మానేశావూ?"

"అయ్యో, నా బతుక్కి రోషం కూడానూ. ఎవళ్ళే పనిచెబితే అది పుచ్చుకోవాలిగాని లేకపోతే—"

"ఇంకా యెవరెవ రేమేం పనులు చెప్పారూ?"

"నువ్వూ అలావెళ్ళావు, నాలుగు కుంచాల కందులతట్టా వచ్చి నా నెత్తి కెక్కింది"

"అయితే?"

"అయితేనా? ....చచ్చి దోరి అది దింపేసుకుని యిదిగో సానదగ్గిర కూచున్నాను"

"ఇదయాకా?"

"............... ..."

"నాలుగు తిప్పులు తిప్పుతావు గిన్ని గి—ౖరున నిండి చక్కాపోతుదిం తరవాత యేం చేస్తావమ్మా?"

"........ఇప్పటికి నీ కూతురి జుబ్బామాౖతమే కనపడుతోంది. మరో పనేదీ తగలకపోతే అదే చేస్తాను"

"తప్పకుండా చేసిపెట్టు. ఇదెంతసేపులే? తరవాత యెవరికీ తెలియకుండా జుబ్బా పుచ్చుకుని డాబామీద కూచో, యించక్కటి గోదావరి గాలి వస్తుందక్కడికి"

"గాలికోసం డాబామీదికే వెళ్ళనక్కర్లేదు. నే నెక్కడుంటే అక్కడే కావలసినంతానూ"

"ఇక నీయిష్టం. ఊరికే నీసుఖంకోసం చెప్పాను; గాని నాకు కావలసింది జుబ్బా కుట్టెయ్యడమే. అయితేనూ, చిన్నక్క యేమిటీ యిచ్చి వెళ్ళిందిటా?"

"దానికి రైక కుట్టిపెట్టాలిట"

"తనకి చేతకాదటనా?"

"..................."

"దొరగారు దయచేస్తారటనా?"

"..................."

"నే నిచ్చినప్పుడే యివ్వాలి కామోసు నటనా?"

"..................."

"అయితే దానికూ్కడా చింపు లయినా యటనా?"

"..................."

"వులిక్కిపడి చూడనక్కర్లేదు. అబ్బో నీ గుణం నాకు తెలియదను కున్నావేం? అదంటే నీకు దిక్కుమాలిన అభిమానం, అంచేత నేను ముంది చ్చిన పనిమానేసి అది మొదలు పెట్టావు"

"చూసీ చూడని మాటలు—"

"చూడనే అక్కర్లేదు. లక్షమాట్లు చూశానుకూడా. దాని మొగడు ఇంగ్లీషు చదువుతున్నాడని— ఇంకా నాలుగేళ్ళక్కాని బి. య్యే కాడుట. అదయినా యీమధ్య ఫేలయిపోకుండా వుంటేట. మీబావ చెప్పారు చాలా మాట్లు. బి. యే. అయితేగాని— అయినా యీ రోజుల్లో లాభం లేదుట"

"చెప్పేదేమయినా వినిపించుకోడం...."

"ఇంకా చెప్పడం యెందుకూ, యీమాత్రమూ తెలియదనుకున్నావా? నువ్వెప్పుడూ దానికోసం దొర్లిపోతావు. నాకంటే నీకదేమీ వొరగబెట్టదు"

"..................."

"చంటిపిల్లే యెక్కువో, తాడిచెట్టులాగ కాపరం చేసేదే యెక్కువో కని పెట్టలేకపోయావు"

"..................."

"తండ్రి తెచ్చిన గుడ్డ, పింతల్లివి నువ్వు కుట్టిపెడతావని— చూడవే నీ కేసి యెంత ఆశగా చూస్తోందో నా రత్నాల మూట?"

"దిక్కుమాలిన పిన్ని, చచ్చిపోయిన పిన్ని, నాకేసి చూస్తే యేం వుంది తల్లీ....మామ్మే, మాతల్లే! నా మీద వాల్తావు, మీ అమ్మదగ్గిర. నే నెంతటిదాన్ని కన్నా? జుబ్బా కుట్టిపెడతానమ్మా ! రాత్రి తిండేనా మానేసి కుట్టి పెడతాను. ఏం, సరా?"

"చేరదీసినవాళ్ళని పట్టుకుని పాకులాడతాదు పిల్లలు. నీకు తెలిసింది కాదు గాని, నాపిల్ల నీపిల్లే అనుకుంటే యెంత బాగుంటుంది? ఇలా అయిన వాళ్ళు లోకంలో అక్కల పిల్లల్ని పెంచుతూ యెందరు సుఖపడ్డంలేదూ?"

"....................."

"చిన్నక్కలాగ మాయమాటలు చెప్పడం నాకు చేతకాదు. నువ్వంటే నేనెంత అభిమానపడి ఛస్తానో—యెందుకూ చెప్పుకోడం? నువ్వు నాతో మా యింటికి వచ్చావంటే నిమిషంలో లేవగొట్టెయ్యనూ మా ఆడబడుచునీ? నా యింటి పెత్తనంకూడా నీ కిచ్చెయ్యనూ?"

"....................."

"నువ్వు చేసే చాకిరీచూస్తే— నువ్వు పిల్లని చూసుకుంటూ వుంటే నీకొక్క పని చెబుతానా నేను?"

"....................."

"ఇంచక్క మాధవస్వామి గుడి మాయింటి కెంతో దగ్గిర. రోజూ వెళ్ళి పురాణం—అంతకంటే నీకు మరేంకావాలి? గుప్పెడన్నమూ, చారెడు బట్టా—నీకు లోటు చేస్తానా నేను? తాళాలు నీచేతికి యిచ్చేస్తారు మీ బావ. నెల్లాళ్ళు తిరిగారంటే దోసెడేసి రూపాయలు. నోములూ, వ్రతాలూ, కాశీ రామేశ్వరాలూ – వో? నీ కడ్డేమిటీ నాయింటోనూ?"

"....................."

"చిన్నక్కతో వెడదామని వుబలాటపడుతున్నావేమో, అది నిన్ను తీసుకువెళ్ళదు. వొంటెత్తు పీనుగు ఆది, నీకు అన్నంకూడా పెడుతుందా? కాకపోయినా పెట్టడానికి దానికేం వుందీ? పాస్ పీస్ మంటూ యింగ్లీషేగాని భూమేదీ? రెండెకరాలేనా? అదేనా మెరక. మాది పదెకరాల చెరువు కింది పల్లం ఇంతకీ దాని మొగుడు—అలాంటిచోట నువ్వుండ గూడదు"

"....................."

"నువ్వేనా వూహ తెలిసినదానవుగాని చంటిపిల్లవుకావు, బాగా ఆలోచించుకో"

"....................."

"ఈ మాటలు చిన్నక్కతో అన్నావుసుమీ! వో—శ్రీ కజ్జాగోరు పీనుగు. నన్నేం చెయ్యగలదు గానీ—అయినా యెందుకూ?"

"....................."

"చెప్పకేం"

"అలాగే"

"నే నొక్కమాటు వాళ్ళ సుందరమ్మగారి యింటికి వెళ్ళివస్తాను, యిదయిపోగానే జాబ్బా కుట్టేస్తావు కాదూ"

"....................."

"మాట్లాడవేమే?"

"వెళ్ళిరా"

"మనం మళ్ళీ ఎచ్చాటప్పటికి పిన్ని నీకు జుబ్బా కుట్టేస్తుంది, వెంటనే నీకు తొడిగేస్తానది, ఇవాళ రాత్రి దాని పక్కలో పడుకుందువుగాని నువ్వు. ఇంచక్క....ఏం తల్లీ...."

"..............."

4

"నువ్విక్క డున్నావు? మహాబాగా దొరికావులే"

"గంధపుగిన్ని పడిపోతుంది, దూరం దూరం"

"పడిపోదే . . . పోనీ దూరంగానే . . . ఏం?"

"ఊఁ"

"నేను సాయం పట్టనా?"

"అక్కర్లేదయేపోయింది. ఈ వాయి వొక్కటీ తీస్తే గిర్రున నిండి పోతుంది గిన్ని"

"అయితే వొక్కమాటు లేవే. ఏమే అక్కా?"

"ఎందుకూ?"

"పనుందే"

"ఏమిటమ్మా ఆ పనీ?"

"ఇంచ—క్కటి పని, మాం—ఛిపని, చేసిపెట్టవూ?"

"ఏమిటో చెప్పు"

"చేస్తానను"

"ముందు చెప్పమన్నాను కాదూ?"

"చెబితే చేస్తావా?"

"నేను చెయ్యగలదయితే చేస్తాను"

"చూ—శావా? . . . నో రూరిపోతోందే"

"ఏమయినా కొనుక్కున్నావా?"

"డబ్బేదీ?"

"అమ్మ నడగలేకపోయావా?"

"అడిగాను. ఇస్తానంది. ఇవ్వబోయిందికూడాను. ఇంతలో అమ్మమ్మ ముండ—"

"తప్పతప్పు, ఏమిటా తిట్లు?"

"మరి—మరి—ఇచ్చేవాళ్ళని చెడగొట్టడమేం? ఆ డబ్బుంటే మా బువ్వాలాట యెంత బాగుండునూ?"

"ఎవరెవరాడుకుంటున్నారూ?"

"వాళ్ళ వెంకట సుబ్బులూ, వాళ్ళ బుచ్చెమ్మా, వాళ్ళ లక్ష్మీరాజ్యమూ, వాళ్ళ గవిరిముండా —"

"ఛీ, ఛీ! ఏమిటలా అయిపోతున్నావు చివరికి?"

"మరి వొట్టి చేతులతో రావడమేం?"

"తక్కిన వాళ్ళేమి తెచ్చారూ?"

"సుబ్బులు డబ్బు కారపు సెనగపప్పు తెచ్చింది. బుచ్చెమ్మ డబ్బు వేరుసెనక్కాయలు తెచ్చింది. రాజ్యం పే-ద్ద కొబ్బరిపెచ్చు తెచ్చింది"

"ఉహూ"

"నన్ను డబ్బు బెల్లంముక్క తెమ్మన్నారు"

"కొనడం యెందుకూ, అమ్మ నడుగు యిస్తుంది"

"నువ్వియ్యి"

"నే నివ్వకూడదమ్మా!"

"చూ-శావా?........ ఇవ్వవుటే అక్కా?"

"చెప్పినమాట విను. ముందు దూరంగా వెళ్ళు"

"అయితే, యేడుస్తా నేమనుకున్నావో"

"................"

"లేకపోతే తిట్టేస్తాను"

"నువ్వేం చేసినా నేనివ్వను, ఇవ్వకూడదు"

"వంటింటో యెవరూలేరే! అంతా వాకిట్లో వున్నారే, నాకు గూళ్ళెం అందిందికాదు, నేనే తీసుకుందునే?"

"................"

"ఇవ్వవ్?"

"ఇవ్వను"

"ముచ్చెం మూడు మాట్లూ అడుగుతాను"

"................"

"అడిగేస్తా"

"................"

"ఇవ్వవ్? ఇవ్వవ్? ఇ-వ్వవ్?"

"................"

"ఇంకొక్కమాటడుగుతాను, ఇస్తావా యివ్వవా?"

"................

"సరే, మాట్లాడకు. ఇలా వుందా నీపనీ........"

"........అయ్యో! అయ్యో! గంధపుగిన్ని పట్టుకుపోతావుటే? అమ్మమ్మతో చెప్పనా?"

"చెప్పకో....చెప్పకో....చెబుతావేం?....ఏం?"

"........రామా! రామా! గిన్నెడు గంధమూ నేలపాలు చేసిందోయ్ తండ్రీ! ఇప్పటికే నా రెక్కలు పడిపోయాయోయ్ నాయనా! ఒక్కచుక్కయినా పనికిరాదోయ్ బాబూ! వోయి దేవుడా — "

"అలా యేడు. అలా కూలబడు. ఏం, నన్నేడిపిస్తే పూరకుంటా ననుకున్నావేం? .. ...."

"...................."

5

"ఏం చేస్తున్నావు రుక్కూ?"

"ఇప్పుడే గంధం యింట్లో పెట్టేసి వచ్చి కూచున్నాను, పెద్దక్క కూతురు జుబ్బా కుడదామని"

"దాని కిప్పుడేం తొందరా?"

"ఎవళ్ళపని వాళ్ళకి తొందరే. ఇంకా పూర్తి చెయ్యలేదా అని క్షణం కిందటే సాగతీసుకు వెళ్ళిందది"

"తేరగా చేసేవాళ్లు దొరికితే సరి, తనేంచేస్తుందిట?"

"అడగలేదు"

"అడగనేవద్దు. అది యింటో పడేసి ఒక్కారా"

"ఎందుకూ?"

"చెబుతా ముందు పడేసిరా"

"పడేస్తాను చెప్పు"

"కందులు వేయించాటప్పటికి అమ్మమ్మకి వొళ్ళు హూనం అయిపోయింది"

"ఊఁహూ"

"నన్ను మీనాన్న తలంట మంటున్నారు. నేనే కాని పనికిరాదుట"

"ఊఁహూ"

"అమ్మమ్మ తనకి వుప్పుపిండి పేసుకుంటుందిట"

"..................."

"నువ్వు వంట చెయ్యాలి"

"..............."

"ఏం, అలా తెల్లపోతావేం?"

"..............."

"ఇవాళకే, రేపు నేనే మడి కట్టుకుంటానులే"

"కందులు బాగుచేశాటప్పటికీ, రెండుమాట్లు గంధం తీశాటప్పటికీ నాకు రెక్కలు పడిపోయాయే అమ్మా"

"రెండు మాట్లూ మూడు మాట్లూనూ. ఏం, అంత రెచ్చగొట్టడమేం దాన్ని?"

"..............."

"ఇంతకీ పొయిదగ్గిర కూచోడమే కాదూ, రుబ్బాలా పోటు వెయ్యాలా?"

"..............."

"అరిటికాయ పప్పులోవేసి, వంగవరుగూ మునక్కాడలూ పనసపెచ్చూ బెండకాయా వేసి పులుసు చెయ్యి"

''పెద్దక్కనైనా చిన్నక్కనైనా చెయ్యి మనరాదుటే?''

వాళ్లెందుకు చేస్తారమ్మా మనకి? ఇక్కడ మనం పనిచెబితే అక్కడ వాళ్ళ మొగుళ్ళ కేం కోపంవస్తుందో? అత్తగార్లేం దెప్పుతారో''

''..............''

''వాళ్ళంతటివాళ్ళు వాళ్ళూ, మనంతటి వాళ్ళం మనమూనూ, మనక్కి వోపిక వుంటే పెట్టాలి, లేకపోతే పంపెయ్యాలి గాని పని చెప్పగూడదు''

''...............''

''అప్పుడే ఆరయిపోయింది. లే, కూచోకు, మీనాన్న పెందరాళే వంట కావాలంటున్నారు. ఆగుడ్డ అవతల పడేసి—ఇంకా చూస్తావేం?''

''...............''

''చద్దన్నాల్లోకి వుండాల, మామిడికాయల పచ్చడి మాత్రం— తెలిసిందా? అమ్మమ్మ నడుగు ఎన్నికాయలు చెయ్యాలో చెబుతుంది''

''...............''

''అన్నట్టు వొక్క చెక్కపేడైనా లేదుకింద. చీకటి పడకుండా తొరగా చిట్టటక యెక్కి నాలుగు పూటలకి సరిపడేవి తీసి చూరులో పెట్టాలి. మరిచిపోకు''

"................"

"అమ్మమ్మ కొయ్యరొట్టి చేసుకుంటా నంటే కొబ్బరికాయ కొట్టి ముక్కలుతరిగి ఇయ్యి. పచ్చట్లోకూడా—వినపడుతోందా యేమయినా?"

"..................."

"లేవా ల్లేవాలి, కూచుంటేకాదు........"

"............న్స, రామయ్యతండ్రి, నాబతు కిలా వెళ్ళి పోవలసిందేనా మహాప్రభూ?........"

6

"ఏయ్, ఎవరు వంటింటో?"

"నేనురా తమ్ముడూ?"

"నిమిషంలో అన్నం పెట్టెయ్యాలి నాకు"

"................"

"మాట్టాడవేం? సినీమాకి వేళ అయిపోతోంది, తొరగా వడ్డించెయ్యాలి"

"అంత తొంద రయితే—"

"తొంద రన్న తొందర కాదు, కంచం పెట్టుకోనా, ఆకు వేస్తావా?"

"ఇంత సేపటిదాకా యేం చేస్తున్నావురా?"

"డబ్బులు చూసుకోవాలా మరీ?"

"ఇప్పుడా డబ్బులు చూసుకోవడం?"

"తెల్లవారింది మొదలు అడుగుతున్నాను మూడు గంటలికి వొప్పుకుంది అమ్మ; కాని వెధవ అమ్మమ్మ-"

"ఆ, ఆ"

"నా సినిమా డబ్బు లడ్డుకొడితే వూరుకుంటానేం?"

"................"

"అలా నుంచుంటావేం వడ్డించక?"

"ఎసట్లో బియ్యం పొయ్యలేదురా మరీ"

"ఇప్పటిదాకా యేం చేస్తున్నావు? వెధవది రెండో ఆటకి వెడితే రేపు చదువు పాడయిపోతుంది ఇప్పుడేనా బియ్యం పోసెయ్యవేం?

"ఎసరు కాగందే?"

"నీమొఘంలాగే వుంది, మరెలాగా యేడవడం?"

"పొడి అన్నం వుంది తింటావా?"

"అఘోరించినట్టుంది నీమాట. పోనీ అదే—"

"చిన్నక్కనైనా పెద్దక్కనైనా పెట్టమను"

"వాళ్లు రారట. వాళ్ళకి తీరుబడి లేదుట"

"ఏం చేస్తున్నారూ?"

"చిన్నక్క మల్లెమొగ్గల దండ గుచ్చుకుంటోంది. పెద్దక్క యెదటింటి శ్యామలాంబగారితో గవ్వ లాడుకుంటోంది నువ్వే పెట్టాలి"

"నేను ముట్టుకోగూడదురా"

"అయితే తగలడు వెధవ ఆచారమూ నువ్వూనూ"

".... ...."

"లేకపోతే పదిన్నర దాకా మేలుకొని వుండు."

"స్నానం యెలాగా చేస్తుంది కనక అమ్మమ్మ పెడుతుందేమో వెళ్ళి అడిగిరా"

"నాకక్కర్లేదు?"

"ఏం?"

"ఆవిడ కళ్ళు పడితే అన్నం జీర్ణంకాదు"

"........"

"పనసపెచ్చు ముక్కలూ, మునక్కాడ ముక్కలూ నాకు చాలా అట్టే పెట్టాలి సుమా. లేకపోతే చితకొట్టేస్తా నేమనుకున్నావో?"

7

"ఇవాళ నువ్వు మడికట్టుకున్నా వేమమ్మా?"

"అమ్మ కట్టుకోమంది నాన్నారూ"

"పెద్దక్క యేం చేస్తోంది?"

"ఏమోనండీ"

"చిన్నక్కో?"

"ఏమోనండీ"

"మీ అమ్మమ్మో?"

"చివరికదీ మాట. అందరికళ్లూ తిరిగి తిరిగి నామీద పడతాయి. పనిదగ్గరికి వచ్చాటప్పటి కొక్కళ్ళూ నన్ను మరిచి పోరు. నేనలాంటి పుణ్యం చేసుకున్నాను కామోసు. అయితేనూ, యేమోయ్? నాలుగుకుంచాల కందులు వేయించి, నడుం లాక్కుపోయి, ముద్దయి పోయి, వోమూల కూలబడ్డాను కదా, నేనింకా వండి వడ్డించగలననే అనుకున్నా వుషోయ్?"

"ఆ సంగతి నాకేం తెలుసునండీ?"

"ఇదేకాదు, యింటిసంగతులే యేమీ తెలపడంలేదు నీకు. భోజనం చేస్తావు, వూళ్ళో తిరిగి తిరిగి మళ్ళీ వంట అయాటప్పటి కింటికి చేరుకుంటావు. లేకపోతేముసుగు తన్ని — చెయ్యలేక నేను చచ్చిపోతున్నాను—"

"మీఅమ్మాయి యేం చేస్తోందీ?"

"అది వూరికే కూచుంటోందనా నీవూహ?"

"......."

"వంటలోకి రాదు కాని, పై పనంతా యెవరు చేస్తున్నారో నీకేమయినా తెలుసూ?"

"........."

"అయినా, నాశక్తి సన్నగిల్లి పోయింది. నారెక్కలు మూలపడ్డాయి. మునపటిలాగ నేనిక చెయ్యలేను. దీనికి నువ్వేమయినా వుపాయం చూడాలి"

"రేపు డాక్టరు బ్రహ్మానందంగారికి కబురు చేస్తాను—"

"శాస్త్రం చెప్పిన తరవాయిగా వుంది నీమాట. కాటికి కాళ్ళు చాచుకున్న దానికి నాకు వైద్యాలేమిషోయ్ యిప్పుడూ?"

"పనిమాట దేవు డెరుగును, మీరు సుఖంగా తిని కూచోడాని కయినా శక్తివుండాలా?"

"పని చెయ్యడం కష్టంగా వుందిగాని నా కేం తెగులా? పైపని కేమీ బాధ లేదు. వంట దగ్గిరే వస్తోంది"

"మీ అమ్మాయి వంటే చెయ్యరాదూ, పైపని రుక్కమ్మకప్పగించి?"

"చెప్పాను కాదూ? అవి తెములుచ్చుకోడం మాత్రం మాటలా? కాక పోయినా, తలచెడ్డవాళ్ళిద్దరింటోవుండగా పునిస్త్రీపడుచు మడికట్టుకోడం యేమిషోయ్?"

"........."

"లోకంలో ఎక్కడైనావుందిషోయ్?" యీ సబబూ?"

"........."

"పైగా, పదిహేను రోజులనుంచి మా అమ్మకి అన్న హితవు లేదు కూడానూ?"

"అయితే, అప్పుడప్పుడు వండిస్తూ వుండండి రుక్కమ్మచేత, రోజూ మాత్రం వద్దు"

"అయితే నామాట?"

"అంటే?"

"నీకింత తెలియకుండా వుందేమిషోయ్? అది చేసిన వంట నన్ను తిన మంధావా యేమిషోయ్? అయ్యో, నా గ్రహచారమా?"

"........."

"నేను పొయ్యిదగ్గిర పడి దేవుళ్ళాడడం యెలాగా తప్పనప్పు డిక అదిన్నీ పడికట్టుకున్న అందం యేమిషోయ్?"

"........."

"దానివల్ల నాకు వొరిగింది మాత్ర యేమిషోయ్?"

"అయితే, నన్నేం చెయ్యమంటారూ?"

"నానోటితో చెప్పించుకోవాలని వుందా?"

"................"

"నిజంగా నీకు ఆలోచనే తోచలేదంటావా?"

"తోచలేదు"

"అయ్యో?"

"................"

"ఎప్పే చదివావు కదా—"

"మీరు చెబితే యేం?"

"అయితే విను, చెబుతాను, దాని బతు కంతా తెల్లారేపోయింది, ఇంకే మున్నా లేనట్టే"

"కనక?"

"ఎప్పుడో వొకప్పు డెలాగా తప్పదు. రోజులు గడవడమే కాని లాభం యేమీలేదు"

"అయితే:......ఏమిటి చివరికి?"

"తల అంటుకోనా దువ్వకోనా? జడ వేసుకోనా? యింకెందుకోయ్ దానికా దిక్కుమాలిన జుట్టు."

"—అదే మమ్మా పులుసు కింద పోసేస్తున్నావూ?"

"......గరిటె వేడిగా వుండడంవల్ల చెయ్యి వొణుకుతోంది నాన్నారూ"

"ఇందాకా రామదీక్షితులుగారి నడగ్గా యెల్లుండి దశమినాడు మంచి దన్నారు. కోటిలింగాలికి వెడితే వొక్క నిమిషం పనీ"

"............"

"నువ్వు కాస్తదూరం ఆలోచిస్తే కాని వీలులేదు. మొగుడు చచ్చిన పడుచుపిల్లలికి మంచిరోజులు కావివి. మొన్ననే వీరేశలింగం తోటలో వొక

వేధవ పెళ్ళి అయిందట. ఇంత నలుగురు వెధవకొడుకులకోసం వెతుకుతున్నారట ముండల్ని తోటలోవాళ్ళు. ఒక ముహూర్తం లేకుండా. వాక సమయా సమయాలు చూడకుండా, యేక్షణంలో దొరికితే ఆక్షణంలో చేసేస్తున్నారట పెళ్ళిళ్ళు. తరవాత యేమనుకున్నా యిక కలసిరాదు సుమా!"

"పదిహేడేళ్ళయినా యింకా నిండలేదుకదా—"

"అయితే? ఎన్నేళ్ళు నిండితే యేమిటి? కాకపోయినా, పదిహేడేళ్ళు నిండలేదు కనకనే పాడు బుద్ధులేమీ పుట్టకుండా జాగ్రత్తపడాలి వెనకాల వాళ్ళు"

"..........."

"అమ్మ పేరు కదా అని గారాం చూపిద్దా మనుకుంటున్నా వేమో! యిది కొరివితో తల గోక్కోవడం కాని మరోటి కాదు"

"మీఅమ్మాయి యేమంటుందీ?"

"దానిమా టెందుకూ నీకూ?"

"అయినా—"

"ఎంత అవసరం వచ్చినా తల్లిపీనుగు నోటితో చెప్పగలదు షోయ్ ఆమాట"

"నేను మాత్రం?"

"మొగరాజవు నీకేం? కాకపోయినా, యెవరికీ బాధ లేకుండా నేనున్నాను కాదూ. మూడోకంటివాడికి తెలియకుండా తెల్లవారాటప్పటికి చేయించెయ్యడానికి!"

"......అదేమమ్మా నీళ్ళలా వొలకబోశావూ?"

"......నేతిజిడ్డు మూలాన చేతిలో చెంబు జారిపోయింది నాన్నారూ"

"చూశావా?... విన్నావా? ఇదీ వరస ఒక్కపని చేతకాదు. చేసినంత మట్టుకయినా వొబ్బిడీ, నిదానమూ లేదు. తేరగా తిని కూచున్నట్టే వుంటుందా వండి వడ్డించడం అంటేను?"

"........."

"మాట్లాడవేమోయ్?"

"ఏమనమంటారండీ?"

"ఏమన మంచానా?......నువ్వూరుకుంటే నేనూరుకుంటా ననుకున్నావా?"

".........."

"వీధికి వెడితే పెద్దలందరూ నాగుడ్లు పీకేస్తున్నారు. తెలుసా నీకేమయినా?"

"......."

"దేనికీ మాట్టాడవు కనక దానికి మాట్టాడకుండానే వూరుకో నువ్వు చేస్తే గాని ఆగిపోయే దేమీలేదు"

"......."

"రేపు లేదెల్లుండి దశమీ బుధవారం తప్పదు. నీకిదే చెప్పడం ఏమనుకున్నావో"

"......"

"వినపడింది షోయ్?"

"చెవుల్లో వోరు పుట్టుకు వస్తూవుంటే వినపడకపోవడం యేమిటండీ?"

9

రుక్కమ్మ తన పక్కమీదికి వచ్చాటప్పటికి ఖరాగా పదకొండయింది, రాత్రి.

అప్పటి కప్పడే—యింటిల్లపాదీ—బహిరంగంగా పడుకుని వున్నవారంతా గాఢనిద్రలో వున్నారు.

ముసలమ్మ బావురుబిల్లులతో కాట్లాడుతోంది, వంటింటి వసారాలో నులకమంచంమీద.

మండువా హాల్లో రుక్కమ్మ పడక.

అక్కడికి తానెలా వచ్చిందీ యెరగదామె.

వచ్చాక మాత్రం అంతయింటో — అంతమంది వున్న యింటో తానొక్కతె మట్టుకే మేలుకొని వుండడంచూసి తన అసహాయతను పూర్తిగా గ్రహించేసుకుంది.

దాంతో, దీపం బంతి పువ్వులాగే వెలుగుతోంది; కాని, యిల్లంతా అంధకారబంధురంగా కనపడిందామెకి.

ఆమెకి అసలేమీ తోచడమేలేదు.

తోచినా బోధకావడం లేదు.

అయినా అది నిలపడం లేదు.

నిలవడమే వస్తే అంతలో అంతా అడివీ ముళ్ళూ అయిపోతోంది.

కాగా, తన వొంటరి తనం భరించుకోలేక ఆమె గట్టిగా కళ్ళు మూసుకుంది.

కాని, దానివల్ల మరీ విషమించింది.

రైకగుడ్డ చేతపట్టుకుని కొరకొరచూస్తూ చిన్నక్క వొకవేపునా, జుబ్బాగుడ్డ పట్టుకుని పళ్ళు పట పట్టాడిస్తూ పెద్దక్క వొకవేపునా, కత్తినూరుతూ

మంగలి వెంటరాగా, సగం పళ్ళూడిపోయిన దెయ్యపునోరు తెరుచుకునీ స్వయంగా కత్తెర చేత్తో పుచ్చుకుని అమ్మమ్మ వొకవేపునా, రెక్కలు పడి పోయే టట్టు తాను తీసిన గంధం అంతా సెంటు కలిపి పూసుకుని బుగ్గాబుగ్గా ఆనించుకుని తల్లీ తండ్రీ వొకవేపునా—

రుక్కమ్మకి వొళ్ళు రణకంపరం యెత్తిపోయింది.

ఇక పడుకుని వుండలేక వెంటనే ఆమె గభీమని లేచి కూచుంది, చాప మీద.

కూచోనూ లేక వుబ్బెత్తుగా లేచి నుంచుంది.

నుంచోడం తడువుగా వూచలాగ వాకిట్లోకి వచ్చేసింది. వచ్చిన వెంటనే తలుపులు తెరుచుకుని వీధిలో పడింది. చెర తప్పినట్లనిపించిం దామెకి, దాంతో.

ఆమె కాళ్ళలో విద్యుద్వేగం పుట్టింది.

కళ్ళల్లో దివ్యజ్యోతీ వెలిగింది.

ఒక్క నిమిషంలో, ఒక్కమాటు, ఇన్నీస్‌పేట వీధులు, పటం తిప్పే సిన ట్టయిపోయాయి.

నిదానించగా ఆమె నాళంవారి సత్రం వెనకవేపున నిలచివుంది.

ఎదట—వరద రావుహోటలు, ముందర ఆమె కెవరో మనుష్యులు కనపడ్డారు.

"బాబోయ్" అనుకుంటూ ఆమె నిలువునా కొయ్యయి పోయింది.

ఒక గోడవార జట్కాకింద పడుకుని చుట్ట కాల్చుచుంటూ వున్న జట్కావా డిదంతా చూశాడు.

"బండి కావాలా?"

"................"

"మేఘాలమీద యెగిరిపోతేనే డబ్బివ్వండి"

"...................."

"అర్ధరాత్రి. తేళ్ళోపాములో — రూపాయలా, అర్ధలా పావలా డబ్బు లివ్వండి"

ఇవి అడిగినా జవాబు రాకపోవడంవల్ల జట్కామనిషి అనుమానపడి లేచివచ్చి పరకాయించి చూస్తూ "యెక్కడికి వెడతా రమ్మాయిగారూ?" అనడి గాడు మెల్లిగా.

"ఏపేట నీది?" అని ఆమె అంతకంటేనూ మెల్లిగా అడిగింది.

"దానవాయిగుంట" అని చెప్పాడు చెవిలో వూదినట్టు, ఆమనిషి.

"ఏం పుచ్చుకుంటావు?" అంటున్నట్టు పెదవులు కదిపిం దామె.

"పంతులుగారి తోటకా?" అని అడిగాడు వాడు, ఏదో జ్ఞాపకం చేసుకుంటూ.

ఉప్పొంగిపోయి "అవు" నన్నట్టు తల వూపిం దామె.

"నిమిషాలమీద తోలుకుపోతాను బండెక్కండమ్మాయిగారూ "అంటూ వాడు బండికేసి బయలుదేరాడు.

అయితే "నాదగ్గిర వొక్క రాగిదమ్మిడీ అయినాలేదు" అంటూ ఆమె చరా చరా రెండడుగులు వేసింది.

"పంతులుగారి తోట కయితే నాకేమీ యివ్వనక్కర్లేదు తల్లీ" అని చెబుతూ గుర్రంపూన్చి, వాడు జట్కా తీసుకువచ్చాడు.

వెంటనే మాట్లాడకుండా బండిలోయెగిరిపడి శరీరం కుంచించుకుం దామె.

కొరడా ఫెడేలుమంది.

వేగం అందుకునీ దాకా గుర్రంతో కూడా పరిగెత్తి తరవాత వాడు కూడా బండిమీదికి వురికాడు.

"నాకూ తెలుసునం డమ్మాయిగారూ కష్టసుఖాలు. నాకొక్కత్తే కూతురండి. అది యీడేరిన నెలకే — పెద్దల్ని చెయ్యకుండానే — పదిరోజుల కిందటే దానిమొగుడు చచ్చిపోయాడండి. దాన్ని చూసినా, జ్ఞాపకం వచ్చినా నా కడుపు మడుగయిపోతోందం డమ్మాయిగారూ! . . . . . నాపనే యిలా వుంటే, యిక మాయింట్దిదాని మాట చెప్పడాని కేంవుందండి? అది గంజినీళ్ళు కూడా మానేసి లంకణాల మనిషిలాగ మంచం పట్టేసిందండి. పిల్లని వూరుకో మనడానికి నోరురాకా, ఇంటిదాన్ని కనిపెట్టుకుని వుండడానికి వీలు లేకా, బండితోలడం మానేసి నెల్లాళ్ళు ఇంటో వుండిపోదామంటే గడిచేదారి లేకా, నేననుభవించే యాతన దేవుడయినా గుర్తించుకో లేడండి.

పంతులుగారి తోటలో మొన్న రాత్రి రెండు పెళ్ళిళ్ళయినాయండి. నిన్న మూడో దయిండిండి. నాలుగోది కూడా అయిపోయీదే, కాని, సగం దారిలో నాబండే అటకాయించి తండ్రీ అన్నలూ ఆ అమ్మాయిగారిని వెనక్కి లాక్కుపోయారండి. నాకు గుండె లాగిపోయాయండి. ఎంత కోరికతో వచ్చారో, యెన్నాళ్ళనుంచి ఆశపడుతున్నారో, యిప్పుడేం బాధ పడిపోతున్నారో, యికముందు ఆవిడ గతి యేమయిపోతుందో — నా ప్రాణాలు మహా కొట్టుకుంటున్నా యం డమ్మాయిగారూ . .

"మరో పిల్లకోసం వెతుకుతున్నారండి. . .

"మహా బాగుంటా రండి, రాచకొమారుడి లాగ ఆ అబ్బాయిగారు...

"నెలకి అరవై రూపాయల జీతమంటండి...

"రెండో పెళ్ళేగాని పాతికేళ్ళేనా వుండవండి పాపం...

"తండ్రిగారు యగ్గెం పట్టినోరుటండి...

"అక్కడికి వెళ్లి వెళ్ళగానే ఆయనకీ మీకూ పెళ్ళయి పోతుందండి...

"మీరు పుణ్యం చేసుకున్నారు, ఏమీ భయపడకం డమ్మాయిగారూ! ఇక మీకు సుఖమే కాని కష్టం లేదం డమ్మాయిగారూ...

"పదిరోజులు పోయాక—కొంచెం పాతబడి పోయాక మాపిల్లక్కూడా-"

మళ్ళీ యెవరయినా వచ్చి మొన్నటిలాగే అటకాయిస్తారేమో అన్న భయంతో కొరడా మళ్ళీ చెళ్ళుమనిపించాడు జట్కామనిషి.

మేఘాలమీద యెగిరిపోయింది జట్కా.

మళుపుకూడా తిరిగేసింది.

1935 జూన్

ప్రబుద్ధాంధ్ర నుంచి—సవరణలతో

—)o(—